# రూ. 3 కోట్ల ఐటీడీఏ నిధులు మురిగిపాయె!

**కంకర పోసి ఐదేళ్లుగా పనులు చేయని కాంట్రాక్టర్**



సాధన్‌పల్లి-సూర్యనాయక్‌తండా రోడ్డు ఇదే..

శాయంపేట, మార్చి 5 : కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో రూ. 3 కోట్ల ఐటీడీఏ నిధులు మురిగిపోయాయి. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ కంకర పోసి ఐదేళ్లుగా పనులు చేయకుండా వదిలేశాడు. రాజుపల్లి, సాధన్‌పల్లి మీదుగా సూర్యనాయక్‌తండాకు బీటీ రోడ్డు నిర్మాణానికి 2018లో అప్పటి అసెంబ్లీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి ఏటూరునాగారం ఐటీడీఏ నుంచి రూ. 3 కోట్ల నిధులు మంజూరు చేయించా రు. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ అదే సంవత్సరం కంకర పోసి వదిలేయడంతో నిజాంపల్లి, గంగిరేణిగూడెం, సాధనపల్లి, కాట్రపల్లి గ్రామాల ప్రజలు నరకం అనుభవిస్తున్నారు. ఎమ్మెల్యే సత్యానారాయణరావు దృష్టి సారించి రోడ్డు పనులు జరిగేలా చూడాలని కాట్రపల్లి మాజీ ఎంపీటీసీ ఎస్కే గౌస్, మాజీ ఉప సర్పంచ్ ఆజ్మీరా జాయ్, స్థానికులు మంగళవారం కోరారు.

# కోడలిని సరాతంతో కాల్చిన అత్తామామ

నర్సంపేట, మార్చి 5: వేధింపులకు గురి చేస్తూ అత్తామామ సరాతంతో కాల్చడంతో నర్సంపేట జిల్లా దవాఖానలో కోడలు చికిత్స పొందుతున్న ఘటన దుగ్గొండిలో జరిగింది. బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. దుగ్గొండికి చెందిన అడుప బుచ్చయ్య-కోమలి దంపతుల కుమార్తె నాగరాణిని నెక్కొండ మండలం దీక్షకుంటకు చెందిన జల్లి బుచ్చయ్య-శారద దంపతుల కుమారుడు నరేశ్‌కు ఇచ్చి 2017లో వివాహం జరిపించారు. అతడికి కట్నం కింద ఎకరం భూమి, 15 తులాల బంగారం, రూ. 2 లక్షల నగదు ఇచ్చారు. వీరికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అయిన నరేశ్ ఇటీవల ఇల్లు కొనుగోలు చేశాడు. తల్లిగారి ఇంటి నుంచి రూ. 40 లక్షలు తీసుకురావాలని నాగరాణిపై ఒత్తిడి చేస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి తన భార్యను నరేశ్ కొట్టగా ఆమె తన తల్లిదండ్రులకు చెప్పింది. దీంతో కోపోద్రిక్తులైన అత్తామామ నాగరాణి చేతిని సరాతంతో కాల్చారు. అంతటితో ఆగకుండా మంగళవారం బాధితురాలిని చూసేందుకు దీక్షకుంటకు వచ్చిన తల్లిదండ్రులపై దాడి చేశారు. ఈ క్రమంలో బాధితురాలి సోదరుడి తలకు గాయమైంది. ఈ మేరకు దుగ్గొండి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

# లబ్ధిదారుల పూర్తి వివరాలు నమోదు చేయాలి

హనుమకొండ, మార్చి 5 : ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ప్రజా పాలన సేవా కేంద్రాల్లో లబ్ధిదారుల పూర్తి వివరాలు నమోదు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఎంపీడీవోలను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం సమావేశం నిర్వహించారు. గ్యాస్ కనెక్షన్ నంబర్, విద్యుత్ మీటర్ నంబర్‌తోపాటు రేషన్‌కార్డు, ఆధార్ కార్డు పూర్తి వివరాలు ప్రజాపాలన దరఖాస్తులో ఉండాలన్నారు. అసమగ్ర వివరాలు ఇచ్చినవారు ప్రజాపాలన సేవా కేంద్రాల్లో సరిచేసుకునేలా అధికారులు ఏర్పాట్లు చేయాలన్నారు.

**తప్పుల సవరణకు అవకాశం**

వరంగల్: ప్రజాపాలన దరఖాస్తుల్లో తప్పుల సవరణకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని బల్దియా అదనపు కమిషనర్ అనీసుర్ రషీద్ అన్నారు. బల్దియా ప్రధాన కార్యాలయంలో ఈ సేవ, కంప్యూటర్ ఆపరేటర్లకు అవగాహన కల్పించారు. ప్రజాపాలన దరఖాస్తుల్లో తప్పుల సవరణకు గ్రేటర్‌లో 12 సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అద్దెకు ఉండే వారు సంబంధింత ఇంటి నంబర్లు ఇవ్వడం వల్ల ఇంటి యాజమానులకు నష్టం ఉండదన్నారు. కాజీపేట సర్కిల్ కార్యాలయం, సుబేదారి వాటర్‌ట్యాంక్, నక్కలగుట్ట వార్డు కార్యాలయం, కమ్యూనిటీ హాల్, మచిలీబజార్, అశోకాసర్కిల్ ఈ సేవ కేంద్రం, ఈ సేవా కేంద్రం నయీంనగర్, బల్దియా ప్రధాన కార్యాలయం, ఈ సేవ కేంద్రం పోచమ్మమైదాన్, కాశీబుగ్గ సర్కిల్ కార్యాలయం, హెడ్ పోస్టాఫీస్ సెంటర్, శివనగర్, కరీమాబాద్‌లోని ఈ సేవా కేంద్రాల్లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



## అధ్వానంగా మురుగుకాల్వ

పోచమ్మమైదాన్: వరంగల్ 23వ డివిజన్ కొత్తవాడ మార్కండేయ ఆలయం వెనుక వీధిలో రెండు నెలలుగా మురికికాల్వను శుభ్రం చేయడం లేదని స్థానికులు చెబుతున్నారు. డ్రైనేజీ చెత్తాచెదారంతో నిండిపోవడంతో దోమలు, దుర్వాసన భరించలేకపోతున్నామని పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**PLOT FOR SALE**



★మీ పిల్లల బంగారు భవిష్యత్తు కొరకు 2 వేలకు 1గజం భూమి, యాదగిరిగుట్ట దగ్గర @ ఆలేరు, జీడికల్లు రామాలయ, ప్రసిద్ధ శివాలయం దగ్గర్లో, స్పాట్ రిజి. 100% వాస్తు. Cont: 9030769178.
NTW-00

**WANTED**



★త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-311802-All

**CHANGE OF NAME**

★I, DODDA LAXMI, W/o. Immadi Srinivas, R/o. 3-5, Gandhi Street, Chandrugonda, Warangal Dist., TS. Changed My Name as IMMADI SARITHA, W/o. Immadi Srinivas.
NT-328074

★I, IMMADI SRINIVASULU, S/o. Immadi Ramaiah, R/o. 3-5, Gandhi Street, Chandrugonda, Warangal Dist., TS. Changed My Name as IMMADI SRINIVAS, S/o. Immadi Ramaiah.
NT-328074

★I, CHANDA RAVI SHANKER, S/o. Chanda Venkat Rao, R/o. 1-5-71, Station Road, Mahabubabad Town & Dist., TS. Changed My Name as CHANDA RAVI SHANKAR, S/o. Chanda Venkat Rao.
NT-328074

★I, POLPJU RAJ KUMAR CHARY, S/o. Krishnamachary, R/o. 2-1-47/C, Bhavani Nagar, Mahabubabad Town & Dist., TS. Changed My Name as POLOJU RAJ KUMAR CHARY, S/o. Poloju Krishnamachary.
NT-328074

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే

ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే

ప్రకటనల విభాగం : 9182777552

| HANAMKONDA | WARANAGAL |
|---|---|
| 9182777563 | 9182777556 |
| 9182777618 | 9182777557 |

JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777554
JANGAON - 9182777565

# 'ఎల్ ఆర్ఎస్ ఉచితం'.. ఉత్తదేనా?

- మాట తప్పిన కాంగ్రెస్
- కుడా మాజీ చైర్మన్లు మర్రి యాదవరెడ్డి, సుందర్‌రాజ్ యాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి

హనుమకొండ, మార్చి 5: ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎల్ఆర్ఎస్ ఉచితం చేస్తామని చెప్పిన కాంగ్రెస్ నాయకులు అధికారంలోకి రాగానే మాట తప్పారని కుడా మాజీ చైర్మన్లు మర్రి యాదవరెడ్డి, సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్ అన్నారు. మంగళవారం బాలసముద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో వారు మాట్లాడారు. కేసీఆర్ సర్కార్ ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణకు మార్గదర్శకాలు రూపొందించినప్పుడు అప్పటి సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ఎల్ఆర్ఎస్ కోసం ప్రజలు డబ్బులు కట్టొద్దని, రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను దోచుకోవడానికే ఈ కార్యక్రమం చేపట్టిందని విమర్శించారని గుర్తుచేశారు. ఇప్పుడు అధికారంలోకి రాగానే మాట మార్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్చి 31లోగా ఎల్ఆర్ఎస్ కట్టుకోవాలని ప్రకటన చేయడం విడ్డూరంగా ఉందన్నారు. గత ప్రభుత్వ హయాంలో దరఖాస్తు చేసుకున్న 25 లక్షల 44 వేల మంది రూ. వెయ్యి కట్టి రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, ఇప్పుడు వారిపై భారం మోపి రూ. 20 వేల కోట్లు దోచుకునేందుకు కాంగ్రెస్ సిద్ధమైందని విమర్శించారు. మాట నిలుపోకుంటే ప్రజల పక్షాన ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. అందులో భాగంగా బుధవారం హనుమకొండ ఏకశిల పార్కు వద్ద ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. సమావేశంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పులి రజినీకాంత్, కార్పొరేటర్ అశోక్, నాయకులు ఎన్ రమేశ్, జే రమేశ్, ఎం రమేశ్, జానకీరాములు, పరశురాం, మనోజ్, రఘు, కనకరాజు, సీహెచ్.రమేశ్, శ్రీకర్, శ్రీధర్, సదాంత్, శ్రీకాంత్, కృష్ణ, అఫ్జల్, వినయ్ పాల్గొన్నారు.

## గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడులు

ఆత్మకూరు, మార్చి 5: పెంచికలపేట గ్రామ శివారులోని స్థావరాలపై పోలీసులు దాడులు చేసి 1200 లీటర్లు గుడుంబా పానకం, 46 లీటర్ల గుడుంబా సీజ్ చేసి, ఇద్దరిని అరెస్ట్ చేశారు. సీఐ సంతోష్ కథనం ప్రకారం.. నందిగామకు చెందిన ఇస్లావత్ సుశాంత్, ఇస్లావత్ కల్పన గుడుంబాను తయారు చేస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు మంగళవారం స్థావరాలపై దాడులు నిర్వహించి, వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ చెప్పారు.

## 'గద్దర్ కళాక్షేత్రం నిర్మించాలి'

హనుమకొండ చౌరస్తా, మార్చి 5: ప్రజా గాయకుడు గద్దర్ కళాక్షేత్రాన్ని హనుమకొండలోని హయగ్రీవాచారి గ్రౌండ్‌లో ఏర్పాటు చేయాలని గద్దర్ ఆలోచన ఐక్యవేదిక కన్వీనర్ మంచాల ఎల్లయ్య అన్నారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో ప్రజాసంఘాల నాయకులు రమణాల లక్ష్మయ్య, ఐత అనిల్, సుద్దాల నాగరాజు, దాసరి రమేశ్ పాల్గొన్నారు.

## ఎనుమాముల మార్కెట్ ఆదాయం రూ. 33 కోట్లు

కాశీబుగ్గ, మార్చి 5: వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ 2023-24 ఆదాయం ఫిబ్రవరి వరకు రూ.33 కోట్లకు చేరింది. మార్కెటింగ్ శాఖ రూ. 40 కోట్లు లక్ష్యంగా నిర్దేశించగా, ఇప్పటివరకు రూ.33 కోట్లు వచ్చిందని, టార్గెట్ పూర్తి చేసేందుకు కృషి మార్చి వరకు రూ. 35.10 కోట్లు వచ్చింది. పెండింగ్ బకాయిలు వసూలు చేస్తున్నామని, టార్గెట్ పూర్తి చేస్తామన్నారు.

## అంత్యక్రియలు పూర్తి

పర్వతగిరి, మార్చి 5: మోత్యాతండాలో విద్యుదాఘాతంతో సోమవారం మృతి చెందిన ముగ్గురి అంత్యక్రియలు వారి గ్రామాల్లో మంగళవారం పూర్తి చేశారు. భూక్యా రవి, సునీల్, దేవేందర్ మృతి చెందిన విషయం తెలిసిందే. రవి కుమారుడు జశ్వంత్‌కు ఎంజీఎం దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. పండుగ పూట గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# సమాజానికి మార్గదర్శకంగా నిలవాలి

**నర్సంపేట సివిల్ కోర్టు జడ్జి శిరీష**



జడ్జి శిరీషను సన్మానిస్తున్న అధ్యాపకులు

నర్సంపేట, మార్చి 5: ప్రతి విద్యార్థిని ఉన్నతమైన విద్యను అభ్యసించి కుటుంబానికి, సమాజానికి మార్గదర్శకంగా నిలవాలని నర్సంపేట సివిల్‌కోర్టు జడ్జి పి.శిరీష కోరారు. నర్సంపేట డిగ్రీ కళాశాల (అటానమస్)లో మహిళా సాధికారత సెల్ ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహిళా సాధికారత సెల్ కన్వీనర్ డాక్టర్ టి.సుమతి, డెర్మటాలజిస్ట్ డాక్టర్ ఎల్.విద్య, కాకతీయ మెడికల్ కాలేజ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ మల్లం పద్మ, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లం నవీన్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జడ్జి మాట్లాడుతూ విద్యార్థినులు, మహిళలు ధైర్యంతో సమస్యలను ఎదుర్కోవాలన్నారు. గౌరవ అతిథి డాక్టర్ ఎల్.విద్య మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. అనంతరం కళాశాల పొలిటికల్ సైన్స్ అసిస్టెటెంట్ ప్రొఫెసర్ మామిడాల శైలజ రచించిన 'గతి తప్పిన రుతువు' నవలను ఆవిష్కరించారు. విద్యార్థిని హర్షిన్ రచించిన డ్రీమింగ్ ఆఫ్ హోమ్ సంకలనాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మల్లం నవీన్ జడ్జి శిరీష, సెల్ సభ్యులు టి.సుమతి, డాక్టర్ జి.సుమన, యం.శైలజకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఎండీ షహీన్ సుల్తానా, ఎ.లావణ్య, కోఆర్డినేటర్ ఎ.శ్రీనాథ్, తోట రమేశ్, సత్యనారాయణ, విష్ణుకుమార్, ఐ.శివనాగశ్రీను, లకన్‌సింగ్, ఎం నరేందర్, వి.పూర్ణచందర్, ఎం సమ్మయ్య, బి.రమేశ్, ఆర్.కుమారస్వామి పాల్గొన్నారు.

# సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ పనుల్లో వేగం పెంచాలి

**వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య**



సమీక్షలో పాల్గొన్న కలెక్టర్, డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్

వరంగల్ చౌరస్తా, మార్చి 5: సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణ పనుల్లో వేగం పెంచి, గడువులోగా పూర్తయ్యేలా చూడాలని ఆర్అండ్‌బీ అధికారులను వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. మంగళవారం డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ వాణితో కలిసి హాస్పిటల్ నిర్మాణ పనులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను ఆమె తిలకించి, వారికి సూచనలు చేశారు. సమీక్షలో అదనపు డీఎంఈ డాక్టర్ శివరాంప్రసాద్, కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ కరుణాకర్‌రెడ్డి, ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్, కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ దివ్వెల మోహన్‌దాస్, రోడ్లు భవనాల శాఖ ఎస్ఈ నాగేంద్ర, ఈఈ జితేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

# మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి: ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి

రాయపర్తి, మార్చి 5: మహిళలు ఆకాశమే హద్దుగా అన్ని రంగాల్లో రాణించాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి అన్నారు. టీడీఎఫ్ సారథ్యంలో మండలంలోని తిర్మలాయపల్లి కేజీబీవీలో విద్యార్థులకు ఉచితంగా కంప్యూటర్లు, మినరల్ వాటర్ ఆర్వో ప్లాంట్ ఏర్పాటు, క్రీడా కిట్ల పంపిణీ, సోలార్ ఫెన్సింగ్ మరమ్మతులను టీడీఎఫ్ ప్రతినిధులతో కలిసి ఆమె మంగళవారం ప్రారంభించారు. కేజీబీవీ సమగ్రాభివృద్ధికి తనవంతుగా రూ. 5 లక్షలు కేటాయించనున్నట్లు చెప్పారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఉమెన్ ఎంపవర్‌మెంట్ తెలుగు అసోసియేషన్ వ్యవస్థాపకురాలు హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్‌రెడ్డి, తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం ఇండియా అధ్యక్షుడు మట్ట రాజేశ్వర్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ నరేందర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.



కాశీబుగ్గ: మాజీ మంత్రి హరీశ్‌రావు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్రను హైదరాబాద్‌లో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసిన వర్ధన్నపేట డివిజన్ల ఫోరం అధ్యక్షుడు, వరంగల్ పీఏసీఎస్ డైరెక్టర్ నేరెళ్ల రాజు

## విదేశాల్లో ఉద్యోగ అవకాశాల కోసం రేపు స్పెషల్ డ్రైవ్

పోచమ్మమైదాన్, మార్చి 5: తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కమ్), తెలంగాణ ప్రభుత్వ కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాల శాఖ రిజిస్టర్డ్ రిక్రూట్‌మెంట్ ఏజెన్సీ ఆధ్వర్యంలో ఇజ్రాయిల్ (నిర్మాణ కార్మికులు), జర్మనీలో (నర్సెస్) విదేశీ ఉద్యోగ నియామకాలను సులభతరం చేయడానికి స్పెషల్‌డ్రైవ్ నిర్వహిస్తుందని వరంగల్ జిల్లా ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్ ఎన్.మాధవి తెలిపారు. వివరాలకు 9985483931, 8247838789 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

## హద్దుల కూల్చివేత

ఖిలావరంగల్, మార్చి 5: గ్రేటర్ వరంగల్ 17వ డివిజన్ దూపకుంటలో అక్రమ లే అవుట్ హద్దులను బల్దియా అధికారులు మంగళవారం తొలగించారు. ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో సర్వే నంబర్ 1351, 1352లోని హద్దురాళ్లను తొలగించారు.

## పల్లెప్రకృతి వనం సందర్శన

**'నమస్తే' కథనానికి స్పందన**

శాయంపేట, మార్చి 5: మండలకేంద్రంలోని పల్లె ప్రకృతి వనాన్ని అధికారులు మంగళవారం సందర్శించారు. 'ప్రకృతి వనం.. కళావిహీనం' పట్టించుకోని అధికారులు శీర్షికన సోమవారం నమస్తే తెలంగాణలో కథనం ప్రచురితమైంది. దీంతో ఎంపీడీవో ఫణిచంద్ర, మండల పంచాయతీ అధికారి రంజిత్ స్పందించి గ్రామ పంచాయతీ కార్యదర్శి రత్నాకర్‌తో కలిసి పల్లెప్రకృతి వనాన్ని పరిశీలించారు. పార్కును శుభ్రం చేయించి మోటరును రిపేరుకు పంపినట్లు ఎంపీవో తెలిపారు. ఎండిపోయిన మొక్కల స్థానంలో మళ్లీ నాటిస్తామని ఎంపీడీవో చెప్పారు.

## 'మహిళలు అభివృద్ధి సాధించాలి'

హనుమకొండ, మార్చి 5: నాగరికత నిర్మాణంలో గొప్ప పాత్ర పోషించిన మహిళలు ప్రస్తుతం ఆశించిన స్థాయిలో అభివృద్ధి సాధించడం లేదని కేయూ వైస్ చాన్స్‌లర్ రమేశ్ అన్నారు. సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆడిటోరియంలో మంగళవారం ప్రిన్సిపాల్ జ్యోతి అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ రమేశ్, ఉమెన్ సెల్ డైరెక్టర్ శ్రీలత, శ్రీదేవి, రమాదేవి పాల్గొన్నారు.

## నేడు వాహనాల వేలం

కాజీపేట, మార్చి 5: కాజీపేట ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన పలు వాహనాలకు బుధవారం వేలం నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ చంద్రమోహన్ తెలిపారు.



దుర్గామాత ఉత్సవాల్లో పాల్గొన్న ఎర్రబెల్లి

## దైవ సన్నిధిలో మానసిక ప్రశాంతత

రాయపర్తి, మార్చి 5: దైవ సన్నిధిలోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మంగళవారం ఆరెగూడెంలో నిర్వహించిన కనకదుర్గామాత ఉత్సవాలకు ఆయన హాజరయ్యారు. కాగా, జగన్నాథపల్లికి చెందిన గుగులోత్ దేవేందర్ సోమవారం రాత్రి పర్వతగిరి మండలంలోని మోత్యతండాలో జరిగిన కరెంట్ ప్రమాదంలో మృతి చెందగా ఎర్రబెల్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, బీఆర్ఎస్ నేతలు గూడెల్లి శ్రీనివాస్, బద్ధం వేణుగోపాల్‌రెడ్డి ఉన్నారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే శ్రీహరి

## బోనాల పండుగకు కడియం హాజరు

ధర్మసాగర్, మార్చి 5 : మండలంలోని జానకీపురం గ్రామంలో జరుగుతున్న ఎల్లమ్మ తల్లి బోనాల పండుగలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి పాల్గొన్నారు. ఎల్లమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. నాయకులు బొజ్జ రవీందర్ యాదవ్, జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

## నేటి నిరసన కార్యక్రమానికి తరలిరండి: దాస్యం

హనుమకొండ, మార్చి 5 : ఎల్ఆర్ఎస్ దరఖాస్తులపై కాంగ్రెస్ పార్టీ ద్వంద్వ ధోరణికి నిరసనగా బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పిలుపు మేరకు బుధవారం చేపట్టనున్న ధర్నా కార్యక్రమానికి తరలిరావాలని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ పిలుపునిచ్చారు. బాలసముద్రంలోని ఏకశిల పార్కు వద్ద చేపట్టనున్న నిరసన కార్యక్రమానికి ప్రతి డివిజన్ నుంచి బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## అర్హులకు పథకాలు అందించాలి

ఖిలావరంగల్, మార్చి 5: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పీ ప్రావీణ్య ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ప్రావీణ్య, అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ మధుసూదన్‌తో కలిసి ప్రజాపాలన సేవా కేంద్రాల ఏర్పాటు, సాఫ్ట్‌వేర్‌లో వివరాల నమోదుపై మున్సిపల్ కమిషనర్లు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అర్హులందరికీ పథకాలు అందేలా ప్రభుత్వం ఎంపీడీవో కార్యాలయంలో, మున్సిపాలిటీల్లో ప్రజాపాలన సేవాకేంద్రాలను ఏర్పాటు చేస్తుందన్నారు. ప్రజాపాలన దరఖాస్తు సమయంలో వివరాలను సరిగా నమోదు చేసుకోని దరఖాస్తుదారులు ఎంపీడీవో, మున్సిపల్, జీడబ్ల్యూఎంసీ పరిధిలో ఏర్పాటు చేసే 12 ప్రజాపాలన సేవా కేంద్రాల ద్వారా తప్పులను సవరించుకోవాలన్నారు. తెల్ల రేషన్‌కార్డు, ఆధార్ కార్డు, గ్యాస్ కనెక్షన్ నంబర్, విద్యుత్ మీటర్ నంబర్ మ్యాచ్ అయితేనే సదరు లబ్ధిదారులను ఎంపిక చేస్తామన్నారు. వివరాలు మ్యాచ్ కాని పక్షంలో మరోసారి సరైన వివరాలు నమోదు చేసుకోవాలన్నారు.

## ఇంటర్ సెకండియర్ పరీక్షకు 250 మంది గైర్హాజరు

గిర్మాజీపేట, మార్చి 5: ఇంటర్ సెకండియర్ మ్యాథ్స్-2A/బాటనీ/సివిక్స్ పరీక్షలకు 250 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఐఈవో కాక మాధవరావు ఒక ప్రకటనలో తెలిపారు. జనరల్, ఒకేషనల్ కోర్సుల్లో 6,300 మంది విద్యార్థులకు 6,050 మంది హాజరైనట్లు డీఐఈవో పేర్కొన్నారు. మంగళవారం నర్సంపేట బాలికల ప్రభుత్వ కళాశాల, టీఎస్‌డబ్ల్యూఆర్‌జేసీ, ఖానాపురం ప్రభుత్వ కళాశాలను తనిఖీ చేయగా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని వెల్లడించారు.

## విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

చెన్నారావుపేట, మార్చి 5: విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన ఘటన లింగగిరిలో మంగళవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. నెక్కొండ రోడ్డులోని శివరాత్రి సమ్మయ్య ఇంట్లో షార్ట్‌సర్క్యూట్ ఏర్పడి పూర్తిగా కాలిపోయింది. దీంతో ఇంట్లోని 7 క్వింటాళ్ల బియ్యం, రూ. 50 వేల నగదు, ఇతర వస్తువులు కాలిపోయినట్లు బాధితుడు తెలిపారు.



పోచమ్మమైదాన్‌లో ప్రదర్శన నిర్వహిస్తున్న నాయకులు

## 'మోదీ పాలనకు చరమగీతం పాడాలి'

పోచమ్మమైదాన్, మార్చి 5: దేశ సంపదను కొల్లగొట్టి మతోన్మాద విధానాలతో ప్రజా సమస్యలను గాలికొదిలి, పెట్టుబడిదారులకు దోచిపెడుతున్న మోదీ ప్రభుత్వానికి చరమగీతం పాడాలని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి పిలుపునిచ్చారు. కమ్యూనిస్టు కోఆర్డినేషన్ కమిటీ పిలుపుమేరకు ఉమ్మడి వరంగల్ కమిటీ ఆధ్వర్యంలో పోచమ్మమైదాన్ నుంచి వరంగల్ రైల్వేస్టేషన్ వరకు మంగళవారం భారీ ప్రదర్శన నిర్వహించారు. నాయకులు పెద్దారపు రమేశ్, ఎన్‌రెడ్డి, హంసారెడ్డి, రవి, చంద్రయ్య, కొమురయ్య, నాగార్జున, ప్రతాప్, బాబురావు, రాగసుధ, సంధ్య, సావిత్రి, వెంకన్న, కుమారస్వామి, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

## 'ఐక్యతతోనే మద్దతు ధరకు చట్టబద్ధత'

వరంగల్‌చౌరస్తా, మార్చి 5: రైతు సంఘాలన్నీ ఐక్యంగా పోరాడితేనే కేంద్ర ప్రభుత్వం నిర్ణయించే మద్దతు ధరకు చట్టబద్ధత లభిస్తుందని జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. వరంగల్ 27వ డివిజన్ పరిధి అబ్బనికుంటలో మంగళవారం తెలంగాణ రైతు సంఘం భవనంలో జిల్లా అధ్యక్షుడు సోమిడి శ్రీనివాస్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఆయన ముఖ్య అతిథిగా హాజరై 'వ్యవసాయ ఉత్పత్తులకు ఇచ్చే మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలి' అనే అంశంపై మాట్లాడారు. సమావేశంలో ప్రొఫెసర్లు వెంకటనారాయణ, వినాయకరెడ్డి, యాదగిరాచార్యులు, గోవర్ధన్, రామ్మూర్తి, రాజయ్య, హంసాల్‌రెడ్డి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే సమక్షంలో ప్రమాణం చేస్తున్న కమిటీ సభ్యులు

## 'పాలక మండలి' ప్రమాణస్వీకారం

మడికొండ, మార్చి 5: మెట్టుగుట్ట పాలక మండలి మంగళవారం వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు సమక్షంలో దేవాదాయ, ధర్మాదాయ శాఖ పరిశీలకుడు సంజీవరెడ్డి ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం చేసింది. చైర్మన్‌గా పైడిపాల రఘుచందర్, డైరెక్టర్లుగా బైరి రాజు, వస్కుల ఉమ, దండిగం శ్రీనివాస్, రొడ్డ దయాకర్, బోగి కేదారి, మాడిశెట్టి జ్ఞానేశ్వరి, ఎక్స్ అఫీషియో సభ్యుడిగా అర్చకుడు రాగిచేడు అభిలాష్‌శర్మ ప్రమాణ స్వీకారం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మహా శివరాత్రి వేడుకలు వైభవంగా నిర్వహించాలని సూచించారు.

**ఇల్లందలో గృహజ్యోతి పథకం ప్రారంభం**

వర్ధన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహజ్యోతి పథకాన్ని మండలంలోని ఇల్లందలో ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు ప్రారంభించారు. గ్రామంలో అధికారులతో కలిసి పర్యటించిన ఎమ్మెల్యే పలువురు లబ్ధిదారుల ఇండ్లకు వెళ్లి విద్యుత్ బిల్లులు తీయించారు.

## ఘనంగా మహిళా దినోత్సవం

ఖిలావరంగల్, మార్చి 5: వరంగల్ కలెక్టరేట్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మంగళవారం టీఎన్జీవోస్ ఘనంగా నిర్వహించింది. ముఖ్య అతిథిగా అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకాడే పాల్గొని మాట్లాడారు. మహిళలు ఐక్యంగా ఉంటూ సమాజంలో ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. అదనపు కలెక్టర్ జీ సంధ్యారాణి, డీడబ్ల్యూవో శారద, డాక్టర్ పీ రజని, డాక్టర్ మమతారెడ్డి, టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## ఏడుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

సుబేదారి, మార్చి 5: టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం ఏడుగురు పేకాట రాయుళ్లను పట్టుకొని రూ. 14 వేల నగదు, ఆరు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. హంటర్ రోడ్డు గాయత్రి నగర్‌లో కుడికాల శేఖర్, తుంగ విజయకుమార్, కోవాకుల శివ, తోట మహేశ్, కొండా సూరి, వనం కార్తీక్, నాకేటి సునీల్ పేకాడుతుండగా పక్కా సమాచారంతో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది అక్కడి వెళ్లి వారిని అదుపులోకి తీసుకుని సుబేదారి పోలీసులకు అప్పగించారు.

## అప్పు తీర్చలేక యువ రైతు ఆత్మహత్య



మోహన్‌రావు (ఫైల్)

గీసుగొండ, మార్చి 5 : వ్యవసాయ పెట్టుబడి కోసం తెచ్చిన అప్పు తీర్చలేక యువ రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆరెపల్లిలో మంగళవారం జరిగింది. సీఐ బాబులాల్ కథనం ప్రకారం.. గువ్వాడి మోహన్‌రావు(32)కు మూడెకరాల వ్యవసాయ భూమి ఉంది. పెట్టుబడి కోసం రూ. 3 లక్ష అప్పు చేశాడు. పంటలు సరిగా పండకపోవడంతో మద్యానికి బానిసయ్యాడు. తాగిన మైకంలో ఈ నెల 4న పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు ఎంజీఎం దవాఖానకు తలించగా, చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. అతడి భార్య కృష్ణవేణి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు లిపారు.

## ఆరు రోజుల ఆదాయం రూ. 12.71 కోట్లు

వరంగల్, మార్చి 5 : మేడారం జాతర హుండీల లెక్కింపు ప్రక్రియ సాగుతోంది. హనుమకొండలోని టీటీడీ కల్యాణ మండపంలో హుండీల లెక్కింపులో ఇప్పటి వరకు రూ. 12 కోట్ల 71 లక్షల 79 వేల ఆదాయం వచ్చింది. మంగళవారం రూ. కోటీ 46 లక్షల 9 వేల 280 ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు.

## ఊరుగొండలో బాలిక ఆత్మహత్య

దామెర, మార్చి 5: ఊరుగొండలో బాలిక ఆత్మహత్య చేసుకుంది. ట్రైనీ ఐపీఎస్ అధికారి నాగ్రాలే శుభం ప్రకాశ్ కథనం ప్రకారం.. నల్లగొండ జిల్లా దీపకుంటకు చెందిన వరికొప్పుల వెంకన్న, నాగమణి దంపతులు రెండు నెలల క్రితం వ్యవసాయ బావులు తవ్వేందుకు ఊరుగొండకు వచ్చి అద్దె ఇంట్లో ఉంటున్నారు. బావుల తవ్వకం పనులు ఇష్టంలేని వెంకన్న కూతురు రమ్య(16) ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నది. వెంకన్న ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ట్రైనీ ఐపీఎస్ తెలిపారు.